నమస్తే తెలంగాణ
కరీంనగర్
5 | కరీంనగర్, శనివారం 9 నవంబర్ 2024 | KARIMNAGAR

## పంచాయతీ కార్మికుల సమ్మెబాట



ఎంపీడీవోకు సమ్మె నోటీసు ఇస్తున్న పారిశుధ్య కార్మికులు

వీర్నపల్లి, నవంబర్ 8: గ్రామాల అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్న గ్రామపంచాయతీ కార్మికులు సమ్మె బాట పట్టారు. శుక్రవారం ఎంపీడీవో రఘురాంకు సమ్మె నోటీసు అందజేశారు. సంఘం మండలాధ్యక్షుడు న్యాత నర్సయ్య మాట్లాడుతూ తమ న్యాయమైన డిమాండ్స్ నెరవేర్చడంలో ప్రభుత్వం విఫలమైందని, సమస్యల పరిష్కారానికి సమ్మెలోకి వెళ్తున్నట్లు చెప్పారు. ఇక్కడ శ్రీనివాస్, తిరుపతి, నగేశ్, రాజు, నర్సవ్వ, అంజవ్వ, రమేశ్, రాజయ్య, నరేశ్, ఉన్నారు.

# నేటి నుంచే అసలు సర్వే?

- పలు జిల్లాల్లో ఇంకా పూర్తికాని హౌస్ లిస్టింగ్
- మారిన ఫార్మాట్.. కొత్త ఫారంలో పలు కాలంల ఎత్తివేత
- ప్రతి జిల్లాలో అదనంగా పదిశాతం ముద్రణకు నిర్ణయం
- సర్వే ఫారాలు అందుతాయా..? లేదా? అన్న సందేహాలు

**ప్రభుత్వం ఈ నెల 6వ తేదీ నుంచి చేపట్టిన సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ కుల సర్వే (సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే)లో అసలు ఘట్టం నేటి నుంచి మొదలు కాబోతున్నది. మూడు రోజులుగా చేస్తున్న హౌస్‌లిస్టింగ్ సర్వే శుక్రవారం రాత్రి వరకు పూర్తవుతుందని యంత్రాంగం భావించినా, పలు జిల్లాలో పూర్తికాలేదు. దీంతో నాలుగో రోజు శనివారం కూడా కొనసాగించాలని నిర్ణయించిన అధికారులు, ఇదే సమయంలో ఇంటింటి కుటుంబ సర్వే ప్రారంభానికి సన్నాహాలు చేస్తున్నారు. అయితే ప్రశ్నలకు సంబంధించి ఫార్మాట్ మారడంతో మళ్లీ ఆగమేఘాల మీద ఏ జిల్లాకు ఆ జిల్లా ఫారాల ముద్రణకు ఆదేశాలు ఇచ్చారు. అయితే ఇవి శనివారం ఉదయం వరకు కూడా అందరికీ అందేలా లేవని తెలుస్తున్నది. దీంతో హైరానా పడుతున్న అధికారులు.. ఆ మేరకు ఎన్యుమరేటర్లకు ప్రత్యామ్నాయ విధులు అప్పగించేందుకు చర్యలు తీసుకుంటుండగా, ఉమ్మడి జిల్లావ్యాప్తంగా పూర్తి స్థాయిలో సర్వే ఆదివారం లేదా సోమవారం నుంచి ప్రారంభమయ్యే అవకాశం కనిపిస్తున్నది.**



ఈనెల 6న కరీంనగర్‌లో ఇంటికి స్టిక్కర్ అంటిస్తున్న సిబ్బంది

కరీంనగర్, నవంబర్ 8 (నమస్తేతెలంగాణ ప్రతినిధి) : రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేను ఈ నెల 6 నుంచి ప్రారంభించిన విషయం తెలిసిందే. ముందుగా చెప్పిన దాని ప్రకారం చూస్తే ఆ రోజు నుంచే ఇంటింటి సర్వే ప్రారంభం కావాలి. కానీ, 2011 తర్వాత జనాభా లెక్కలు, నివాసాల సంఖ్య కచ్చితంగా లేకపోవడం వంటి కారణాల నేపథ్యంలో ముందుగా నివాసాలు లెక్కింపు చేయాలనే నిర్ణయం తీసుకున్నారు. ఆ మేరకు 6, 7, 8 తేదీల్లో హౌస్‌లిస్టింగ్ చేసేందుకు అధికారులు రంగంలోకి దిగారు. 2011 జనాభా లెక్కల ఆధారంగా గుర్తించిన నివాసాలు, ఆనాటి బ్లాక్‌లను పరిగణలోకి తీసుకొని, ముందుగా ఎన్యుమరేటర్లను నియమించిన అధికారులు.. పాత బ్లాక్ పరిధిలో 2011 నుంచి 2024 మధ్య కొత్తగా నిర్మించిన నివాసాలను లెక్కిస్తున్నారు. ఒక ఇల్లు కూడా మిస్ కాకుండా ఉండేందుకు గుర్తించిన ప్రతి ఇంటికీ స్టిక్కర్ అంటిస్తున్నారు. దీని వల్ల నివాసాల లెక్క పక్కాగా జరుగుతుంది. ఈ నేపథ్యంలో ఉమ్మడి జిల్లావ్యాప్తంగా గృహాల సంఖ్య భారీగా పెరుగుతున్నట్టు తెలుస్తున్నది. నిజానికి ఈ నివాసాల లెక్కింపు ప్రక్రియ శుక్రవారం రాత్రి వరకు పూర్తి కావాలి. కానీ, ఒక్క సిరిసిల్ల మినహా కరీంనగర్, జగిత్యాల, పెద్దపల్లి జిల్లాల్లో సంపూర్ణంగా పూర్తి కాలేదని అధి కావ ర్గాల ద్వారా తెలుస్తున్నది. అందుకు కొంత సమయం పట్టే అవకాశం కనిపిస్తున్నది. కాగా, ఇప్పటివరకు ఉన్న సమాచారం ప్రకారం.. 2011తో పోలిస్తే ఒక్కో జిల్లాలో 5 నంచి 7వేలకుపైగా కొత్తగా నివాసాల సంఖ్య పెరిగినట్టు తెలుస్తున్నది. ఈ నేపథ్యంలో లెక్క పూర్తిగా తేలితే తప్ప పూర్తిస్థాయిలో ఎన్యుమరేటర్లను వేయడం సాధ్యం కాదు. ప్రతి ఎన్యుమరేటర్‌కు 150 ఇండ్ల చొప్పున 2011 జనాభా లెక్కల ఆధారంగా ఇప్పుడు నియమించారు. ఈ లెక్కన కొత్తగా గుర్తించే ఇండ్లకు కూడా ఎన్యుమరేటర్లను నియమిస్తే.. ఏక కాలంలో సర్వే పూర్తి చేసేందుకు ఆస్కారమున్నది.

### ఎక్కడికక్కడే ముద్రణ

గతంలో సర్వే కోసం ముద్రించిన ఫారంలో 56ప్రశ్నలతో కూడిన 75 అంశాలు ఉండేవి. కోర్టు ఆదేశాలు, ఇతర వర్గాల నుంచి వచ్చిన సూచనలను పరిగణలోకి తీసుకొని, ప్రభుత్వం సర్వే ఫార్మాట్‌ను మార్చింది. ప్రస్తుతం 55 ప్రశ్నలతో 75 అంశాలను పొందు పరిచింది. అంటే ఒక్కో ఇంటి యజమాని నిర్ధారిత 75 అంశాలకు సంబంధించి సమాచారం ఇవ్వాల్సి ఉంటుంది. మొదటికి ఇప్పటికి ఫార్మాట్ మారడం, సదరు ఫారాలను పీడీఎఫ్ రూపంలో ప్రభుత్వం గురువారం సాయంత్రం జిల్లాలకు పంపడంతో అదనపు కలెక్టర్లు ఆగమేఘాల మీద ఫారాల ముద్రణకు చర్యలు తీసుకున్నారు. ఒకే ప్రింటర్ ద్వారా అయితే ఆలస్యమవుతుందని భావించి, నలుగైదుగురు ప్రింటర్లను పిలిచి ఈ బాధ్యతలు అప్పగించారు. అయినా 8 పేజీలతో ఫారం ఉండడం ఒక ఎత్తు అయితే.. వచ్చిన ఫారాలను ప్యాకింగ్ చేసి మండలాల వారీగా పంపడం, అక్కడి నుంచి బ్లాక్‌ల వారీగా వెళ్లడం, తిరిగి వాటిని ఎన్యుమరేటర్లకు అప్పగించడం వంటి ప్రక్రియలో కొంత జాప్యం జరిగే అవకాశం ఉంది. వీటిన్నింటిని పరిగణలోకి తీసుకొని చూస్తే.. సర్వేఫారాలు శనివారం ఉదయం కల్లా మెజార్టీ ప్రాంతాల్లో ఎన్యుమరేటర్లకు చేరవన్నది స్పష్టమవుతున్నది. దీంతో సదరు ఎన్యుమరేటర్లను శనివారం కూడా హౌస్‌లిస్టింగ్ సర్వేకు వాడుకోవాలని అధికారులు భావిన్నారు.

### ఫార్మాట్‌లో మారిన ప్రశ్నలు.. అంశాలు

ప్రభుత్వం ముందుగా తయారు చేసిన ప్రశ్నల్లో మెజార్టీ శాతం అలాగే ఉంచి, కొన్ని చోట్ల మార్పులు చేసింది. కొన్ని మార్పులు చేర్పులు చేసినా.. ఎనిమిది పేజీలకే ఫారాన్ని పరిమితం చేసింది. ప్రస్తుతం ఒక ప్రశ్న తగ్గినా అంశాల సంఖ్య అలాగే ఉంచింది. మారిన ప్రశ్నలు– అంశాలను చూస్తే ఈ విధంగా ఉన్నాయి. పేజీ నంబర్ 5లో ధరణి పాస్‌బుక్ కలిగి ఉంటే నంబర్ రాయండి అనే ప్రశ్నకు అనుసంధానంగా ధరణి పాస్ బుక్ లేనట్లయితే కారణం తెలిపేందుకు కొత్తగా కాలం యాడ్ చేశారు. అలాగే పేజీ నంబర్ 6లో గతంలో 45వ కాలంలో మీరు డీనోటిఫై చేయబడిన/ సంచార/ పాక్షిక సంచార తెగకు చెందినవారా..? అనే ప్రశ్నను కొత్త ఫారంలో పూర్తిగా తొలగించారు. పేజీ నంబర్ 7లో ముందుగా విడుదల చేసిన ఫారం ప్రకారం గతంలో ఉన్న కాలం 46(సీ) 46 (డీ) కాలం ఎత్తివేశారు. పేజీ నంబర్ 8లో ఏ అవసర నిమిత్తం రుణం తీసుకున్నారు? ఎక్కడి నుంచి రుణం తీసుకున్నారు? అనే ప్రశ్నలు ఉండగా.. ఇప్పుడు 48(డీ) కాలం పేరిట ఇంకా చెల్లించాల్సిన రుణం ఎంత మొత్తం ఉందనే ప్రశ్నను కొత్తగా యాడ్ చేశారు. ఇదే పేజీలో నివాస గృహం ఏరకం అనే ప్రశ్నకు అనుసంధానంగా మీ ఇండి గోడలు ప్రధానంగా దేనితో నిర్మించారు అనే కొత్త ప్రశ్నను యాడ్ చేశారు. వీటితో పాటు ఇదే పేజీలో కొత్తగా మీ కుటుంబ సభ్యుల్లో ఎవరైనా కులాంతర వివాహం చేసుకున్నారా..? ప్రశ్నను జోడించారు.

# ఇదేనా మహిళా స్వావలంబన?





- గడువులోపే విద్యార్థుల దుస్తులు కుట్టి అందించిన మహిళా సంఘాల సభ్యులు
- అప్పు తెచ్చి పెట్టుబడులు
- నాలుగు నెలలు గడుస్తున్నా అందని కుట్టుకూలి చెల్లింపులు
- ఎస్ఎస్ఏ నుంచి విడుదలైన మొత్తం మాత్రమే చెల్లింపు
- మిగతా సొమ్ముపై నోరు విప్పని యంత్రాంగం
- అధికారుల చుట్టూ ప్రదక్షిణలు
- మండిపడుతున్న మహిళలు

**'మహిళలు ఆర్థికంగా ఎదిగినప్పుడే వారి కుటుంబాలు ఉన్నత స్థానానికి చేరుకుంటాయి. అందుకే మహిళలకు చేయాల్సిన సాయంకన్నా అధికంగా తోడ్పాటునందిస్తున్నాం. ప్రభుత్వం వారిని స్వయం ఉపాధి పనుల దిశగా ప్రోత్సహిస్తున్నది. అందులో భాగంగానే సర్కారు పాఠశాలల విద్యార్థులు, అంగన్‌వాడీ పిల్లలకు ఏకరూప దుస్తులు కుట్టేపని మహిళా సంఘాలకే అప్పగించాం' అని అధికార పార్టీ పెద్దలు గొప్పలు చెబుతుండగా.. మహిళా సంఘాల సభ్యురాళ్లు మాత్రం తీవ్రంగా మండిపడుతున్నారు. ఏకరూప దుస్తులు కుట్టాలని తమకు వస్త్రం ఇవ్వగానే నిర్దేశించిన గడువులోపే పూర్తిచేసి అందించామని, కానీ, ఇప్పటివరకు కుట్టుకూలి డబ్బులు పూర్తిగా విడుదల చేయలేదని ఆగ్రహిస్తున్నారు. తెచ్చిన అప్పునకు వడ్డీ చెల్లించలేక నానాతిప్పలు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సమగ్ర శిక్ష అభియాన్ నుంచి విడుదలైన నిధులు మాత్రమే తమ ఖాతాల్లో జమచేసి, రాష్ట్ర ప్రభుత్వం అదనంగా అందిస్తామన్నా మిగతా మొత్తం నెలలు గడుస్తున్నా విడుదల చేయడం లేదని వాపోతున్నారు. ఇలా అయితే మహిళలు ఎలా ఆర్థిక స్వావలంబన సాధిస్తారని ప్రశ్నిస్తున్నారు.**

కరీంనగర్, నవంబర్ 8 (నమస్తే తెలంగాణ ప్రతినిధి)/ కలెక్టరేట్ : ఈ విద్యా సంవత్సరం ఆరంభమయ్యే నాటికి ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఏకరూప దుస్తులందించేలా మహిళా సంఘాల సభ్యులకు బాధ్యతలప్పగించారు. ఒక్కో విద్యార్థికి రెండు జతల చొప్పున అందించాల్సి ఉండగా, మొదట ఒక జత సిద్ధం చేసి ఇవ్వాలని సూచించారు. కుట్టుకూలి కింద ఒక్కో జతకు ₹50 చొప్పున చెల్లిస్తామని అధికారులు చెప్పగా, తమకు సరిపోవడం లేదని మహిళా సంఘాల సభ్యులు తమతో నిర్వహించిన సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి వినతిపత్రం అందించారు. ఒక్కో జతకు ₹25 అదనంగా ప్రభుత్వం నుంచి అందిస్తామని సీఎం హామీ ఇవ్వడమే కాదు, కుట్టుకూలి పెంచుతూ ఉత్తర్వులు జారీ చేశారు. మొదటి జత పూర్తి కాగానే జూన్ మొదటివారంలో అధికారులకు అప్పగించారు. అయితే, అప్పటికే సమగ్ర శిక్ష అభియాన్ నుంచి విడుదలైన మొత్తంలో నుంచి జతకు ₹50 చొప్పున మొదటి విడుత కుట్టుకూలి జూలై చివరి వారంలో చెల్లించారు. ఆ వెంటనే రెండో జతకు సంబంధించిన వస్త్రం కూడా సంఘాలకు అప్పగించడంతో అవి కూడా పూర్తిచేసి ఆగస్టు మొదటి వారంలో విద్యాశాఖ అధికారులకు అందజేశారు. మొదటి విడుత పెండింగ్‌లో ఉన్న జతకు ₹25తోపాటు రెండో జత కూలీ ₹75 ఏకమొత్తంగా ₹100 ఒకేసారి తమకు అందుతాయనే భావనతో మహిళలు గడువుకన్నా ముందే దుస్తులు కుట్టి అందించారు. వారం, పది రోజుల్లో నిధులు విడుదల కాగానే, పెండింగ్‌లో ఉన్న మొత్తంతో పాటు రెండో జత కూలి చెల్లిస్తామని అధికారులు హామీ ఇచ్చారు. కానీ, నాలుగు నెలలు గడుస్తున్నా ఇప్పటివరకు కుట్టుకూలి చెల్లింపులపై నోరు మెదపడం లేదని వాపోతున్నారు.

### ఆర్థికంగా ఇబ్బందులు

కరీంనగర్ జిల్లాలో 41,665 మంది విద్యార్థులకు అందించాల్సిన రెండు జతల దుస్తులు 15 మండలాల్లోని 600 నుంచి 700 మంది మహిళలు కుట్టారు. వీరికి మొదటి విడుతగా ₹20,83,250 మాత్రమే చెల్లించారు. ఇంకా ₹41,66,500 చెల్లించాల్సి ఉన్నది. అలాగే, రాష్ట్ర వ్యాప్తంగా 33 జిల్లాల్లోని 26,009 ప్రభుత్వ పాఠశాలల్లో 18,58,841 మంది విద్యార్థులకు 20వేల పైచిలుకు మంది మహిళలు దుస్తులు కుట్టగా, సమగ్ర శిక్ష అభియాన్ నుంచి విడుదలైన ₹9,29,42,050 మాత్రమే వారి ఖాతాల్లో జమచేశారు. మిగతా ₹18,58,84,100 ఎప్పుడు చెల్లిస్తారనేది ప్రశ్నార్థకంగా మారింది. దీంతో మహిళలు ఆవేదన చెందుతున్నారు. అధికారులపై నమ్మకంతో తమ వద్ద పెట్టుబడి సొమ్ము లేకున్నా బాకీ తెచ్చి ముడిసరుకు కొనుగోలు చేశామని, నెలలు గడుస్తున్నా తమకు కుట్టుకూలి చెల్లించకపోతే తమకు ప్రయోజనమేంటని ప్రశ్నిస్తున్నారు. ఉపాధి కల్పన పేర తమను ఇబ్బందుల పాలు చేయడమే ఆర్థిక స్వావలంబనా..? అని మండిపడుతున్నారు. ఎప్పుడు చెల్లిస్తారో చెప్పాలంటూ నిత్యం అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నా తమను పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### కుట్టుకూలి తొందరగా చెల్లించాలి

నేను 5,774 మంది విద్యార్థుల డ్రెస్సులు, 12,040 మంది అంగన్‌వాడీ పిల్లల డ్రెస్సులు కుట్టిన. ఇప్పటివరకు ఒక్క రూపాయి కూడా నాకు చెల్లించలేదు. అధికారులను అడిగితే ప్రభుత్వం నుంచి డబ్బులు విడుదలైన అనంతరం చెల్లిస్తామని చెబుతున్నరు. కుట్టుకూలి తక్కువే అయినా, ఒకేసారి పెద్దమొత్తంలో డబ్బు వస్తుందనే ఆశతో అప్పు తెచ్చి కుట్టు మిషన్లు, దుస్తులు కుట్టేందుకు అవసరమైన ముడిసరుకులు కొన్న. నాలుగు నెలలు గడుస్తున్నా డబ్బులు రాలేదు. అప్పు తెచ్చిన మొత్తానికి నెలనెలా వడ్డీ చెల్లిస్తున్న. ఇలా అయితే మాకు మిగిలేది ఏముండదు? కనీసం రోజు వారీ కూలీ కూడా పడదు. అధికారుల చుట్టూ తిరిగి తిరిగి యాష్టకొస్తున్నది. ప్రభుత్వం స్పందించాలి. మా కూలీ డబ్బులు వెంటనే చెల్లించాలి.

**- పద్మ, మహిళా సంఘ ప్రతినిధి (గంగాధర)**

# కులవృత్తుల వ్యతిరేకి కాంగ్రెస్

- చేప పిల్లలను సగానికి తగ్గించి మత్స్యకారుల పొట్టకొడుతరా..?
- మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే గంగుల కమలాకర్

కొత్తపల్లి, నవంబర్ 8: కులవృత్తుల వ్యతిరేకి కాంగ్రెస్ అని, ఆ పార్టీ పాలనలో వృత్తులన్నీ ధ్వంసమయ్యే పరిస్థితులు నెలకొన్నాయని మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్ మండిపడ్డారు. శుక్రవారం కొత్తపల్లి మండలం ఆసీఫ్‌నగర్‌లోని బావుపేట చెరువులో ఉచిత చేపపిల్లలను విడుదల చేసి, మాట్లాడారు. కులవృత్తులను కాపాడుకోవాలనే ఉద్దేశంతో తెలంగాణ తొలి సీఎం కేసీఆర్ చెరువులను పునరుద్ధరించి, ఉచిత చేప పిల్లలను పంపిణీ చేసి మత్స్య సంపదను పెంచారని గుర్తు చేశారు. ముదిరాజ్, గంగపుత్రులకు చేతి నిండా పనిదొరికి జీవితాలు బాగుపడ్డాయన్నారు. కానీ, కాంగ్రెస్ పాలనలో అన్యాయం చేస్తున్నారని వాపోయారు. ఏటా ఉచితంగా ఇచ్చే చేప పిల్లల సంఖ్యను తగ్గించి మత్స్యకారుల పొట్టకొడుతున్నారని మండిపడ్డారు. కరీంనగర్ నియోజకవర్గంలోని 69 చెరువుల్లో గతంలో 42 లక్షల చేపపిల్లలను ఉచితంగా పంపిణీ చేస్తే, ఇప్పుడు సగానికి తగ్గించి కేవలం 21 లక్షల పిల్లలే పంపిణీ చేయడమే అందుకు నిదర్శనమన్నారు. కరీంనగర్ ఒక్కచోటే కాదని జిల్లా వ్యాప్తంగా సగానికి తగ్గించి పంపిణీ చేస్తూ ముదిరాజ్, గంగపుత్ర కుటుంబాల పొట్టకొడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కులవృత్తులపై ఆధారపడి జీవించే బీసీ కుటుంబాలకు సీఎం రేవంత్‌రెడ్డి అన్యాయం చేయవద్దన్నారు. కేసీఆర్ సర్కారు మాదిరిలా ఒక్క చేప పిల్ల తగ్గకుండా చెరువుల్లో పోయాలని డిమాండ్ చేశారు. ఇక్కడ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ రెడ్డవేని మధు, మాజీ వైస్ చైర్మన్ ఉప్పు రాజశేఖర్, మాజీ వైస్ ఎంపీపీ భూక్యా తిరుపతినాయక్, మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు

# రైతుల్లో భరోసా నింపేందుకే పాదయాత్ర

- పార్టీలకతీతంగా విజయవంతం చేయాలి
- హామీల అమలులో రాష్ట్ర సర్కారు విఫలం
- బీఆర్ఎస్ జగిత్యాల జిల్లా అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు
- కాంగ్రెస్ ప్రతివర్గాన్నీ మోసం చేస్తున్నది
- కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల
- రేవంత్‌రెడ్డిది పాపపు యాత్ర: మాజీ ఎమ్మెల్యే సుంకె

జగిత్యాల రూరల్, నవంబర్ 8: రైతుల్లో భరోసా నింపేందుకే రైతు పాదయాత్ర చేస్తున్నామని బీఆర్ఎస్ జగిత్యాల జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు పేర్కొన్నారు. కాంగ్రెస్ ఎన్నో అబద్ధపు హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిందని, ఇప్పుడు కక్షసాధింపు రాజకీయాలు చేస్తున్నదని మండిపడ్డారు. ప్రభుత్వం పని చేయకపోతే అడిగే హక్కు తమకు ఉందని, రైతుల పక్షాన కొట్లాడుతామని స్పష్టం చేశారు. జగిత్యాల జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడాది కావస్తున్నా.. హామీలు నెరవేర్చకుండా రైతులు, ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నదని విమర్శించారు. అందరికీ రుణమాఫీ చేయాలని, రైతు భరోసా ఇవ్వాలని డిమాండ్ చేస్తూ రైతులకు మద్దతుగా ఈ నెల 12న ఉదయం 8.30 గంటలకు కోరుట్ల నుంచి ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల ఆధ్వర్యంలో కోరుట్ల, మోహన్‌రావుపేట, మేడిపల్లి, చలిగల్ మీదుగా జగిత్యాల కొత్త బస్టాండ్ వరకు పాదయాత్ర చేపడుతున్నామని తెలిపారు. కొత్త బస్టాండ్ వద్ద సమావేశం అనంతరం రైతులతో కలిసి కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తామన్నారు. పార్టీలకతీతంగా అందరూ పాదయాత్రకు తరలిరావాలని పిలుపునిచ్చారు. చలిగల్ వద్ద నుంచి పాదయాత్రలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్, మాజీ మంత్రులు హరీశ్‌రావు, కొప్పుల ఈశ్వర్, హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి, ఎమ్మెల్సీ రమణ, మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్, బీఆర్ఎస్ వేములవాడ ఇన్‌చార్జి చలిమెడ లక్ష్మీనరసింహా రావు, జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత, నాయకులు పాల్గొంటారని తెలిపారు. అనంతరం కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ మాట్లాడుతూ, రాష్ట్రంలో ప్రతి వర్గాన్ని కాంగ్రెస్ సర్కారు మోసం చేస్తున్నదని ధ్వజమెత్తారు. రైతుల పక్షాన ఈ పాదయాత్ర చేస్తున్నామని, జిల్లా వ్యాప్తంగా పార్టీలకతీతంగా రైతులు పాల్గొనాలని పిలుపునిచ్చారు. మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ మాట్లాడుతూ, ఎద్దు ఏడ్చిన ఎవుసం.. రైతు ఏడ్చిన రాజ్యం బాగుపడదన్నారు. ఏక కాలంలో రుణమాఫీ చేస్తానని ప్రకటించిన సీఎం రైతులను మోసం చేశారని విమర్శించారు. సీఎం రేవంత్‌రెడ్డిది పాదయాత్ర కాదని.. పాపపు యాత్ర అని మండిపడ్డారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నెరవేర్చనందుకు పాదయాత్రలో భాగంగా యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ దేవస్థానంలో సీఎం పొర్లుదండాలు వేసి.. తెలంగాణ ప్రజలకు క్షమాపణ చెప్పాలన్నారు. కార్యక్రమంలో జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత, నాయకులు గట్టు సతీశ్, శీలం ప్రియాంక, హరిచరణ్‌రావు, సంగెపు మహేశ్, స్పందన, ఆనందరావు, ప్రసాద్ ఎండబెట్ల, గంగారెడ్డి, తుమ్మ గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.

# వడ్డీ వ్యాపారులపై దాడులు

- ₹80లక్షల విలువైన 216డాక్యుమెంట్లు స్వాధీనం
- అధిక వడ్డీలు వసూలు చేస్తే చర్యలు : ఎస్పీ

సిరిసిల్ల తెలంగాణ చౌక్, నవంబర్ 8: సిరిసిల్ల జిల్లా వ్యాప్తంగా వడ్డీ, ఫైనాన్స్ వ్యాపారులపై శుక్రవారం పోలీసులు దాడులు చేశారు. 24టీంలుగా ఏర్పడి ఏక కాలంలో తనిఖీలు చేపట్టారు. ఆరుగురిని అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి సుమారు ₹80లక్షలు విలువైన 216డాక్యుమెంట్లు స్వాధీనం చేసుకున్నారు. ఈ వివరాలను ఎస్పీ అఖిల్ మహాజన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎవరైనా ఫైనాన్స్ వ్యాపారం చేయాలనుకుంటే ప్రభుత్వ అనుమతితో నిబంధనలకు లోబడి నిర్వహించాలని సూచించారు. ప్రజల ఆర్థిక అవసరాలను ఆసరాగా చేసుకొని అధిక వడ్డీలు వసూలు చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అక్రమ వడ్డీ వ్యాపారుల వివరాలు తెలిస్తే సమీప పోలీస్‌స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలని ప్రజలను కోరారు.

# గన్నీ సంచులు ఇప్పించండి

- అదనపు కలెక్టర్‌కు రైస్ మిల్లర్ల వినతి



కలెక్టర్‌కు వినతి పత్రాలు రాస్తున్న రారైసు మిలర్లు

రాజన్న సిరిసిల్ల, నవంబర్ 8 (నమస్తే తెలంగాణ): ఎఫ్‌సీఐకి బియ్యం సరఫరా కోసం అవసరమైన గన్నీ సంచులు ఇప్పించాలని అదనపు కలెక్టర్‌ను సిరిసిల్ల జిల్లా రైస్‌మిల్లర్లు కోరారు. శుక్రవారం కలెక్టరేట్‌లో మిల్లర్ల సంఘం నాయకులు చేపూరి నాగరాజు, బుస్స శ్రీనివాస్ ఆధ్వర్యంలో రారైస్‌మిల్లర్లు, పారాబాయిల్డ్ రైస్ మిల్లర్లు అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్‌ను కలిశారు. గన్నీసంచులు ఇవ్వకుండా జిల్లా మార్కెటింగ్ మేనేజర్ ఇబ్బందులకు గురిచేస్తున్నారని వాపోయారు. ధాన్యం తెచ్చిన గన్నీసంచులలో బియ్యాన్ని ఎఫ్‌సీఐ తీసుకోవడం లేదని, గన్నీ సంచులు వెంటనే ఇప్పించాలని కోరారు. ఆ తర్వాత మార్కెటింగ్ శాఖాధికారి కలిశారు. గన్నీ సంచులు ఎందుకు ఇవ్వడం లేదంటూ ప్రశ్నించారు. దీంతో ఆ అధికారి స్పందించి, వారంతో తెప్పిస్తానని చెప్పారు.

# ఉన్నతి పొందినా ఆయాల జీతమే

- అప్‌గ్రేడ్ అంగన్‌వాడీ టీచర్ల ఆవేదన
- మూణ్నాళ్ల ముచ్చటగా వేతన పెంపు
- సాంకేతిక లోపాన్ని సాకుగా చూపుతున్న అధికారులు



అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లలకు బోధిస్తున్న టీచర్

**అంగన్‌వాడీలపై ప్రభుత్వం చిన్నచూపు చూస్తున్నది. గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారం, పూర్వప్రాథమిక విద్య అందించే టీచర్లను నిర్లక్ష్యం చేస్తున్నది. కరీంనగర్ జిల్లాలోని పలు సెంటర్లను ఇటీవల అప్‌గ్రేడ్ చేయగా, అందులోని టీచర్లకు ఆయాల జీతమే ఇస్తూ పొట్టకొడుతున్నది. కేవలం రెండు, మూడు నెలలు మాత్రమే కొత్త వేతనాలు అందించి ఆ తర్వాత నెలల నుంచి చేతులు దులుపుకోగా, కుటుంబాలకు ఆవేదనే మిగిలింది.**

కరీంనగర్ కలెక్టరేట్, నవంబర్ 8: కరీంనగర్ జిల్లాలోని నాలుగు అంగన్‌వాడీ ప్రాజెక్టు పరిధిలో 777 కేంద్రాలుండగా, వీటిలో 752 మెయిన్, 25 మినీ సెంటర్లు ఉన్నాయి. అయితే గత కేసీఆర్ ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా మినీ సెంటర్లను అప్‌గ్రేడ్ చేయాలని సూచిస్తూ కేంద్రానికి లేఖ రాసింది. స్పందించిన కేంద్ర మాతా శిశు సంక్షేమశాఖ వీటి హోదా పెంచేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. దీంతో ఈ ఏడాది జనవరి నుంచి రాష్ట్రంలోని మినీ సెంటర్లన్నీ అప్‌గ్రేడయ్యాయి. వాటిలో విధులు నిర్వహిస్తున్న టీచర్లకు వేతనం ₹7,500 నుంచి ₹13,500 పెంచడంతోపాటు సహాయకులనూ నియమించేలా ఆదేశాలు జారీ అయ్యాయి. అయితే పెంచిన వేతనాలు మాత్రం కొత్త ఆర్థిక సంవత్సరం నుంచి విడుదల చేస్తామంటూ ప్రకటించిన ప్రభుత్వం, ఈ యేడాది ఏప్రిల్ నెల నుంచి రెండు, మూడు నెలల పాటు కొత్త వేతనాలు ఇచ్చింది. కానీ, ఆ తర్వాత నెలల నుంచి మాత్రం మళ్లీ పాత వేతనమే విడుదల చేస్తున్నది. ఇదేంటని అధికారులను ప్రశ్నిస్తే సాంకేతిక సమస్యలను కారణంగా చూపుతున్నట్టు తెలుస్తున్నది. అధికారులు మాత్రం అప్‌గ్రేడ్ అయిన సెంటర్లలో విధులు నిర్వర్తిస్తున్న టీచర్ల వివరాలు స్త్రీ, శిశు సంక్షేమ శాఖ కమిషనర్‌కు పంపినా, అక్కడ నుంచి ఫైనాన్స్ విభాగానికి చేరకపోవడంతోనే సమస్య ఉత్పన్నమైందని టీచర్లు ఆరోపిస్తున్నారు. దీనిపై సమగ్ర పరిశీలన చేసి, వెంటనే ఫైనాన్స్ విభాగానికి పంపాలని కోరుతున్నారు. లేదంటే ఆందోళన చేస్తామని హెచ్చరిస్తున్నారు.

### పూర్తి వేతనం అందించాలి

అప్‌గ్రేడైన అంగన్‌వాడీ సెంటర్లలో విధులు నిర్వర్తిస్తున్న టీచర్లకు పూర్తి వేతనం అందించాలి. సాంకేతిక కారణాలతో పాత వేతనమే పడుతున్నట్టు చెప్పడం సరికాదు. అలా అయితే, మొదటి రెండు నెలలు పూర్తి వేతనం ఎలా విడుదల చేశారో చెప్పాలి.

**- స్వరూప, అంగన్‌వాడీ టీచర్ల సంఘం కరీంనగర్ జిల్లా ఉపాధ్యక్షురాలు**

